క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకే ..

- ఆడుదాం ఆంధ్రా పోటీలు
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పలుచోట్ల వన్ కే రన్‌లు

దేవరపల్లి/నల్లజర్ల/పెరవలి/తాళ్లపూడి/నిడదవోలు రూరల్/గోపాలపురం : విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి విస్తృతం ప్రచారం కల్పిస్తూ శనివారం కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి, నల్లజర్ల, పెరవలి, తాళ్లపూడి, సమిశ్రగూడెం, గోపాలపురం గ్రామాల్లో శనివారం వన్ కే రన్ నిర్వహించారు. ఈ క్రమంలో దేవరపల్లిలో విద్యార్థులు, క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించి, వన్ కె మారథాన్‌లో పాల్గొన్నారు. పల్లంట్ల రోడ్డు నుంచి పోలవరం కుడి కాలువ వరకూ క్రీడాకారులతో కలిసి ఆయన రన్ చేశారు. సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కాగా నల్లజర్లలో నిర్వహించిన వన్ కే రన్‌ను మండల పరిషత్ కార్యాలయ వద్ద ఎంపీడీవో ఎంపీడీఓ రాజశేఖర్ ప్రారంభించారు. రన్‌లో తహసీల్దారు కిశోర్‌కుమార్, ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతి, గృహనిర్మాణశాఖ ఏఈ శివ, సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్, పల్లి సుబ్బారావు, మండల క్రీడా కో–ఆర్డినేటర్ పల్లివెంకట అప్పారావు పాల్గొన్నారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి గ్రామ సచివాలయం వరకూ వన్ కె రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పెరవలి సర్పంచ్ గంగోలు సీతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ టి. రాజరాజేశ్వరి పంచాయతీరాజ్, వెలుగు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడిలో బస్టాండ్ సెంటర్ వద్ద ప్రారంభమైన వన్ కే రన్‌ను ఎంపీడీవో వెంకటరమణ ప్రారంభించారు. తహసీల్దార్ టి.రాధిక, తాళ్లపూడి పంచాయతీ కార్యదర్శి ఆశా ఆలేఖ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నిడదవోలు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సమిశ్రగూడెంలో 3కే రన్ నిర్వహించారు. సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఎంఈఓ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, పీఈటీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. గోపాలపురం మండల పరిషత్ కార్యాయలం వద్ద నుంచి ప్రారంభమైన వన్ కే ర్యాలీని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి, గెల్లా రాజ్‌మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో ఆడుదాం ఆంధ్రా వన్ కే ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

- గోపాలపురం ఎమ్మెలే తలారి వెంకట్రావు
- దేవరపల్లిలో బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

దేవరపల్లి: వెనుక బడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి, అన్ని రంగాల్లో వారిని ముందుకు తీసుకువెళుతోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ నిధులు రూ.20 లక్షలతో దేవరపల్లిలో నిర్మించే శెట్టిబలిజ మల్టీ పర్పస్ కమ్యూనిటీ భవనానికి శనివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ఈ భవానికి అవసరమైన 22 సెంట్ల స్థలాన్ని గ్రామ పంచాయతీ ద్వారా సమకూర్చారన్నారు. నియోజకవర్గంలో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ఎంపీ భరత్‌రామ్ తన నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేశారన్నారు. యాదవోలు గ్రామంలో కూడా బీసీ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రామలక్ష్మి, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఇల వైకుంఠం.. ఉత్తర ద్వార దర్శనం

- నేత్ర పర్వంగా చిన వెంకన్న దర్శనం
- వేలాదిగా శ్రీవారిని దర్శించిన భక్తులు, గోవింద స్వాములు
- కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి



దేవరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి వెళుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: వైష్ణవాలయాలు జాతరను తలపించాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినం కావడంతో స్థానిక చిన వెంకన్న దివ్య క్షేత్రం శనివారం ఇల వైకుంఠాన్ని తలపించింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య వేకువ జాము నుంచే ఉభయ దేవేరులతో శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై భక్త జనులకు దర్శనమిచ్చారు. ఉదయం 4.30 గంటలకు ఉత్తర ద్వారాలను తెరవగా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, పలువురు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శన భాగ్యాన్ని కల్పించారు.

పెరవలి: వైకుంఠ ఏకాదశి, శనివారం కావడంతో అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. అంచనాకు మించి భక్తులు రావడంతో ఆలయ నిర్వాహకులు కొంత ఇబ్బంది పడ్డారు. రెండు గంటలకు పైగా భక్తులు దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. పురుషోత్తపల్లికి చెందిన మృదంగ విద్వాంసులైన మహిళలు 'నమో వేంకటేశా' అంటూ ఆలయం వద్ద చేసిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 25 వేల మంది భక్తులు వచ్చారని ఆలయ నిర్వాహకులు అంచనా వేశారు.

దేవరపల్లి: తెల్లవారుజాము నుంచే భక్తులు స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి చేరుకుని ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి, శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం వరకూ ఆలయం వరకూ భక్తులు రద్దీ కొనసాగింది. స్థానిక షిర్డీసాయి మందిరంలో బాబాను వేంకటేశ్వరస్వామి అవతారంలో అలంకరించి, భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. అలాగే ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. గౌరీపట్నం వద్ద శ్రీపర్వతంపై గల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

నిడదవోలు: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకదశి పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇరువురినీ సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో ఉత్తర ద్వారం నుంచి శ్రీవారిని దర్శిస్తున్న భక్తులు

పంచముఖ ఆంజనేయ స్వామికి..

నల్లజర్ల: కవులూరు గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. వేద పండితుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యుడు గగ్గర గురునాథ్ తెలిపారు. కోలాటం భజన నిర్వహించారు. అలాగే అనంతపల్లిలోని రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం కమిటీల నియామకం



వారా రత్నరాజీవ్



సిద్ధన వాసు



మేకా సురేష్



మేణ్ని సతీష్‌కుమార్

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడిగా వేములూరుకు చెందిన వారా రత్న రాజీవ్ రెండోసారి నియమితులయ్యారు. అలాగే పార్టీ యువజన విభాగం పట్టణశాఖ అధ్యక్షుడిగా సిద్ధన వాసు కూడా రెండోసారి నియమితులయ్యారు. పార్టీ చాగల్లు మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నందిగంపాడుకు చెందిన మేకా సురేష్, తాళ్లపూడి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా అన్నదేవరపేటకు చెందిన మేణ్ని సతీష్‌కుమార్ (చిన్నా) నియమితులయ్యారు. వారి నియామకంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- 200 మందికి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

పెరవలి: పేదల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. గతంలో రూ. ఐదు లక్షలు ఉండే ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.25 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్థాయి పెంచుతూ ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను మండలంలోని ఖండవల్లి గ్రామంలోని రెండు వేల కుటుంబాలకు శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీలో 324 కేవలం రోగాలకే వైద్యం అందేదని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆర్యోశ్రీని 634 వ్యాధులకు వర్తించేలా చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఏహెచ్ విజయ్ కుమార్, సర్పంచ్ పులిదండి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొకె వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కందా వెంకన్న, చిన్నబాబు, జగదీష్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖండవల్లిలో వృద్ధుడికి ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

అంగన్‌వాడీల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళతా

దేవరపల్లి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె శిబిరం వద్దకు శనివారం ఆయన వెళ్లి వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షురాలు టీపీ లక్ష్మి మాట్లాడుతూ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని 12 రోజులుగా సమ్మె చేస్తున్నట్టు ఎమ్మెల్యేకు వివరించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26 వేల చొప్పున వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని ఆమె కోరారు. ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసకువెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో అంగన్‌వాడీ వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ సమీప బంధువు మృతి

నిడదవోలు రూరల్: శాసన మండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్ సమీప బంధువు, నిడదవోలు మండలం ఉనకరమిల్లి గ్రామానికి చెందిన పోలిరెడ్డి నాగ సత్య వెంకట రామారావు (74) మృతి చెందారు. రామారావు పార్థివ దేహానికి ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, తణుకు మాజీ మున్సిపల్ చైర్మన్ వంకా రాజకుమారి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పోలిరెడ్డి భారతీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు పోలిరెడ్డి శివ రామకృష్ణ, స్థానిక నాయకులు పోలిరెడ్డి తాతయ్య, సింగంశెట్టి సూర్యనారాయణ, రంకిరెడ్డి పెద కాపు, వెంకటరత్నం, తణుకు హీరో హోండా షోరూమ్ అధినేత ఒంటెద్దు సురేంద్ర రాజా తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



పోలిరెడ్డి నాగసత్య వెంకట రామారావు (ఫైల్)



ఉనకరమిల్లిలో రామారావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నేడు రాజమహేంద్రవరంలో త్రీ కే రన్



చౌటుపల్లి వీరన్న

కొవ్వూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కలిస్తూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాజమహేంద్రవరంలో త్రీ కే రన్ నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తెలిపారు. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ త్రీకే రన్ ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లు హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యులు, మండల, నియోజకవర్గ స్థాయిలో ఉన్న యువ జన విభాగాల నాయకులు భాగస్వాములు కావాలని వీరన్న కోరారు.

నిడదవోలులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

నిడదవోలు: పట్టణంలో రాయిపేట సచివాలయం వద్ద శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సారధ్యంలో శనివారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును, పార్టీ జెండాను మునిసిపల్ చైర్మన్ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాలను వివరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు యలగాడ బాలరాజు, గంగుల వెంకటలక్ష్మి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు: కలవలపల్లి–2 సచివాలయ పరిధిలోని రామచంద్రాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకుల ఇళ్ల వద్ద జెండాలను ఎగుర వేసి పల్లె నిద్ర చేశారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి పార్టీ మండల గౌరవాధ్యక్ష,అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలోనే ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సత్యవాడలో పలు అధికారిక కార్యక్రమాలు



సత్యవాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఉండ్రాజవరం: దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే అందుతున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సత్యవాడ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే జల్‌జీవన్ మిషన్ కింద రూ.70 లక్షల వ్యయంతో అదే గ్రామంలో నిర్మించే పైపులైన్లు, కళాయిల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి పని కోసం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాలకు వెళితే చాలు పనులు జరుగుతున్నాయన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. రైతులకు మేలు జరిగేలా రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గ్రామంలోని ఇద్దరు లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాలు, మరో ముగ్గురికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మంతెన గీత అనే లబ్ధిదారుకు ఆయన అందజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

సత్యవాడ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాలకు చెందిన 60 మంది, వడ్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన 38 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఇసుకపల్లి ప్రభావతి, సొసైటీ అధ్యక్షుడు పీవీ సుబ్బరాజు, ఎంపీడీవో బీఆర్‌కే రాజు, ఎంఈవో సక్సేనా రాజు, ఏవో విశ్వాసరావు, పెనుమత్స గణపతిరాజు, మరపట్ల ధనలక్ష్మి, నడుంపల్లి జానకీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకే గడప గడపకూ..

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- మోర్త పంచాయతీలో పర్యటన

ఉండ్రాజవరం: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో మోర్త గ్రామంలో పంచాయతీ ఏరియా, 8 వార్డులలో శనివారం ఆయన సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిటికెన సుజని, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు, వీరవల్లి సుబ్బారావు, గ్రంధి బాపూజీ, తిరువు సూర్యనారాయణ, చిటికెన హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో రైతు దినోత్సవం



రైతు కాసాని బాలగంగాధరరావును సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల: రైతు దినోత్సవాన్ని శనివారం దూబచర్ల గ్రామంలోని సంఘమిత్ర స్కూల్లో నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడులు సాధిస్తున్న ఆదర్శ రైతు, దూబచర్ల ఉప సర్పంచ్ కాసాని బాలగంగాధరావు (బాటయ్య)ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. అంతేగాకుండా ధరను కూడ రైతులే నిర్ణయించే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని చరణ్‌సింగ్ పుట్టినరోజు(డిసెంబరు 23)ను జాతీయ రైతు దినోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. సర్పంచ్ తాడిగడప బాలయ్య, పంచాయతీ కార్యదర్శి బి.రత్నం, హెచ్ఎం గిరికుమార్ పాల్గొన్నారు.

మద్యం, సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గోపాలపురం: అనుమతి లేకుండా మద్యం, సారా విక్రయిస్తున్న మండలంలోని ఇద్దరిని ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. గోపవరం గ్రామానికి చెందిన బొర్రా రామకృష్ణను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 12 మద్యం సీసాలు, రాంపాలెం గ్రామానికి చెందిన వనమ బంగార్రాజును అరెస్టు చేసి అతడి వద్ద నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిద్దరినీ కొవ్వూరు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.